క్లుప్తంగా

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



మోపాల్: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, ప్రభుత్వ ఉపాధ్యాయులకు విరమణ సహజమని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్ పేర్కొన్నారు. సోమవారం మోపాల్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎం హెచ్ఎం హదీ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, ఎంఈవో రామారావు, కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆయనను ఘనంగా సన్మానించారు. హదీ సేవలను కొనియాడారు. సముద్రాల రాములు, గోపిడి రవీందర్‌రెడ్డి, మాలోత్ రవీందర్ నాయక్, రవీంద్ర, ఏనుగు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జావిద్, అస్రార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



ధర్పల్లి: ధర్పల్లి ఉన్నత పాఠశాల(ఉర్దూ మీడియం)లో ఉపాధ్యాయులను నియమించాలని ఎస్ఎంసీ చైర్మన్ నజీర్ మహమ్మద్ కోరారు. ఈ మేరకు సోమవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రస్తుతం జరగనున్న బదిలీలో కేటాయించాలని కోరారు. షేక్ హుస్సేన్, అబ్దుల్ మాజీద్, అబ్దుల్ హమీద్, అబ్దుల్ అజీజ్, ఖాజా అహ్మద్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లవెల్లి సొసైటీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి



ఇందల్వాయి: నల్లవెల్లి సొసైటీ చైర్మన్ సంబారి మోహన్ రాజీనామా చేయడంతో నూతన చైర్మన్‌గా నోముల శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఎన్నికయ్యారు. జిల్లా సహకార ఎన్నికల అధికారి మురళి ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 13 మంది డైరెక్టర్లకు గాను 10 మంది హాజరయ్యారు. శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయగా మిగతా తొమ్మిది మంది బలపర్చడంతో శ్రీనివాస్ రెడ్డిని చైర్మన్‌గా ప్రకటించి నియామక పత్రాన్ని అందించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సహకారంతో సొసైటీని అభివృద్ధి బాటలో నడిపిస్తూ రైతులకు నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఈవో తేజాగౌడ్, క్యాషియర్ రాజన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్‌గౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, సంతోష్‌రెడ్డి, దన్న రాజు, చింతల కిషన్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీపీ నర్సయ్యకు సన్మానం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చిన్నోల్ల నర్సయ్యను సోమవారం మండలంలోని ఘన్‌పూర్ గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రజక సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్‌ను శాలువాతో సత్కరించారు. బొల్లారం రమేష్, కొండూరు సాయిలు, రవీందర్, సాగర్, రవి, తిరుపతి పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) ఎంపీటీసీ శాకటి రాజమణి మురళి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరామర్శించారు. మూడు రోజుల క్రితం ఎంపీటీసీ కుమారుడు ప్రేమ్ పిడుగుపాటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన వెంట ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్య, డీసీసీ డెలిగేట్ ధర్మాగౌడ్, శ్యాంసన్, సాయిబాబా, కంచెట్టి గంగాధర్ తదితరులున్నారు.

అన్ని వసతులు బాగున్నాయి



నిజామాబాద్ అర్బన్ : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సౌకర్యాలు బాగున్నాయని సెంటర్‌లో ఉంటున్న అభ్యర్థులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. పోటీ పరీక్షల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని చేసిన ఆరోపణలు అవాస్తవం అన్నారు. నాణ్యమైన భోజనంతో పాటు విలువైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నారని, టెస్టులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

- నిబంధనలు పాటించకుండా వెలుస్తున్న భవనాలు
- పర్మిషన్ లేకుండానే సెల్లార్‌లు
- అక్రమ కట్టడాలకు అధికారుల అండదండలు!



నిజామాబాద్‌నాగారం: నగరంలో భవన నిర్మాణాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. కొందరు నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అటువంటి వారికి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులే అండగా నిలుస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. సామాన్యులు చిన్నపాటి సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణం చేస్తే అధికారులు కూల్చివేసిన ఘటనలు ఉన్నాయి. కానీ పెద్దపెద్ద నిర్మాణాలు అక్రమంగా చేపట్టినా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఖలీల్‌వాడీ ప్రాంతంలో పెద్దపెద్ద భవనాల నిర్మాణాల్లో నిబంధనలు పాటించడం లేదు. పర్మిషన్ లేకుండానే, సెట్‌బ్యాక్ వదలకుండా నిర్మాణం చేపట్టారు. మున్సిపల్ లైసెన్సు ఇంజినీర్లే కాంట్రాక్టర్లుగా అవతరమెత్తి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని ఖలీల్‌వాడీ ప్రాంతం వ్యాపార వాణిజ్య సంస్థలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన సంబంధిత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు ముడుపులు చెల్లించాలి. అప్పుడు నిబంధనలు పాటించుకున్న వారు కన్నెత్తి చూడరు.

- ఖలీల్‌వాడీలోని సరస్వతీనగర్‌లో ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకోని ఆస్పత్రి కడుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు నోటీసు ఇచ్చారు. అయినా నిర్మాణం దర్జాగా చేపడుతున్నారు.
- ఖలీల్‌వాడీలోని ద్వారకానగర్ ప్రాంతంలో అనుమతి తీసుకున్న దానికంటే రెండు అంతస్తులు అదనంగా నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలో 30ఫీట్ల రోడ్డు లేదు. టీఎస్ బిపాస్ చట్టం ప్రకారం 60 ఫీట్ల రోడ్డు ఒకవైపు, మరో వైపు 30ఫీట్ల రోడ్డు ఉండాల్సిందే. నిబంధనలకు తుంగలో తొక్కి నిర్మాణాలు చేస్తున్నారు.
- ఖలీల్‌వాడీ ప్రాంతంలో కోర్టు ఎదుట సైతం మడిగెలా నిర్మాణం ముందుట షెటర్లు మూసివేసి కొనసాగిస్తున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇళ్లకు అనుమతి కోసం దరఖాస్తు చేసే మున్సిపల్ ఇంజినీర్లే కాంట్రాక్టర్లుగా అవతారమెత్తారు. అయితే వీరు భవన యజమానులతో కుమ్మక్కై నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు తాము మాట్లాడుతామని భవన యజమానులకు చెబుతున్నారు. దీంతో సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా మాముళ్లు తీసుకొని చూసి చూడన్నట్లు ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై సంబంధిత టీపీఎస్ అధికారి ప్రవీణ్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

కొనసాగుతున్న బడిబాట





అమృతాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, మల్లారంలో..

డిచ్‌పల్లి : బడిబాటలో భాగంగా సోమవారం మండల నోడల్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి వడ్డెరకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, అమృతాపూర్ జీపీని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్కులు, స్కూల్ యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు జ్యోతి తదితరులున్నారు.

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్లారంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామ్మోహన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు



నిజామాబాద్‌నాగారం: వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ అయిన సందర్భంగా డీఈవో దుర్గాప్రసాద్‌ను ఆ సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంఘం జిల్లా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం అప్‌గ్రేడేషన్ చేసిందన్నారు. నిజామాబాద్ మొత్తం 88 పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఉన్నతీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, విద్యాసాగర్, మల్లేష్‌గడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఇందల్వాయి: ఇందల్వాయిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీవాసులు సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి సమస్యలను విన్నవించారు. సమస్యలు పరిష్కరిస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోత్కూరి నవీన్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన

- శిథిలావస్థకు చేరిన దొండ్లవాగు బ్రిడ్జి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బ్రిడ్జి అడుగు భాగంలో ఊడిపోతున్న రాళ్లు



వంతెనపై దెబ్బతిన్న రోడ్డు

సిరికొండ: భీంగల్ వెళ్లే మార్గంలో సిరికొండ సమీపంలో గల దొండ్ల వాగుపై ఉన్న లో లెవల్ వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ధ్వంసమైన వంతెనతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నిర్మించి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. వంతెనపై ఉన్న సిమెంట్ ఫ్లోరింగ్ లేచిపోయి ఇనుప చువ్వలు తేలుతున్నాయి. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో గతంలో వాహనదారులు అదుపుతప్పి వాగులో పడిపోయిన ఘటనలున్నాయి. అప్పటి డిజైన్ ప్రకారం రెయిలింగ్ బదులు రాళ్లను ఏర్పాటు చేసినా అవి మధ్యలోకి విరిగిపోయాయి. వంతెనను రాళ్లతో నిర్మించారు. వరద ఉధృతికి వంతెన అడుగు భాగంలో బండరాళ్లు ఊడిపోతున్నాయి. దీంతో వంతెన కుంగిపోయే ప్రమాదం పొంచి ఉంది. వంతెనను చిన్న సైజ్ పైపులతో నిర్మించడంతో వానాకాలంలో ఆ పైపుల్లో వరద నీరు పట్టక వంతెన పై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది.

తాత్కాలిక మరమ్మతులు

వరద ఉధృతికి వంతెన పైభాగంలో సిమెంట్ ఫ్లోరింగ్ లేచిపోయి పైపుల మధ్యలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు గుంతలు పూడ్చివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ పనులు నాసిరకంగా చేయడంతో సిమెంట్ లేచిపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జి వద్దనే మూలమలుపు కూడా ఉండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించారు. హైదరాబాద్ వెళ్లడానికి దగ్గరవుతుండటంతో కమ్మర్‌పల్లి, మోర్తాడ్, వేల్పూర్, భీంగల్ మండలాలకు చెందిన ప్రజలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. దొండ్ల వాగుపై శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



దొండ్ల వాగు వంతెనపై స్లాబ్ ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు నడపడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో అదుపు తప్పి వాగులో పడిపోయే ప్రమాదం ఉంది.

– మహిపాల్, న్యావనంది

పట్టించుకోవడం లేదు



దొండ్ల వాగుపై వంతెన శిథిలావస్థకు చేరినప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. వంతెనపై సిమెంట్ లేచిపోయి ఇనుప చువ్వలు తేలుతున్నాయి. నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– శ్రీనివాస్, సిరికొండ

పంపిణీకి సిద్ధంగా స్కూల్ యూనిఫామ్స్



నవీపేటలో యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్డీవో సాయాగౌడ్

నవీపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫామ్స్ సిద్ధంగా ఉన్నాయని డీఆర్డీవో సాయాగౌడ్ అన్నారు. నవీపేటలోని బాలికల ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని నాగేపూర్, శివతండా పాఠశాలల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్న దుస్తులను సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన దుస్తులను ఈ ఏడాది డ్వాక్రా గ్రూప్ సంఘాల నుంచి సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూప్ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. లక్ష్యానికి అనుగుణంగా నిర్ణీత గడువులో డ్వాక్రా మహిళలు దుస్తులను సిద్ధంగా ఉంచారని అభినందించారు. మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ఉషారాణి, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్, సీసీలు సువర్ణ, ప్రవీణ, శ్రీనివాస్, రాజమణి పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన



పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న జీసీడీవో వనిత

నిజామాబాద్‌అర్బన్: బడిబాటలో భాగంగా సోమవారం జీపీఎస్ కోటగల్లి పాఠశాలను సమగ్ర శిక్ష జీసీడీవో వనిత సందర్శించారు. బడిఈడు పిల్లల నమోదును వివరాలు తెలుసుకున్నారు. సోమవారం వరకు ఆరుగురు పిల్లలు నమోదు అయినట్లు హెచ్ఎం రామచందర్ గైక్వాడ్ తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో సోమవారం నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. జీసీడీవో వనిత ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్‌పుస్తకాలు అందజేశారు.

మంచిప్పలో జీపీ కార్మికుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు

మోపాల్: మండలంలోని మంచిప్ప గ్రామంలో మల్టీపర్పస్ కార్మికులు (జీపీ) ఐదు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో సోమవారం గ్రామ పంచాయతీ ఎదుట భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పని చేస్తేనే కడుపు నింపుకునే పేదలమని, ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. పన్నులు వసూలు చేసి వచ్చిన డబ్బులు అరకొరగా చెల్లిస్తున్నారని, అనారోగ్యానికి గురైతే డబ్బుల్లేక వైద్యం చేయించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. పన్నుల వసూళ్ల ద్వారా ఇస్తున్న డబ్బులు ఏ మాత్రం సరిపోవడం లేదని, 11 మంది మల్టీపర్పస్ కార్మికులు జీపీలో పని చేస్తున్నారని తెలిపారు. వేతనాలు చెల్లించకపోతే పనులు మానేస్తామన్నారు. ఇదేవిషయమై పంచాయతీ కార్యదర్శి శ్యాం కుమార్‌ను వివరణ కోరగా, ప్రతినెలా పన్నుల వసూళ్ల ద్వారా వస్తున్న డబ్బులను కార్మికుల వేతనాలకే వెచ్చిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల్లో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున అందిస్తామన్నారు.

చక్కెర కర్మాగారాన్ని రైతులకు అప్పగించాలి



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నాయకులు

నిజామాబాద్ రూరల్: చక్కెర కర్మాగారాన్ని రైతులకు అప్పగించాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి కొండెల సాయారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల భారతీయ కిసాన్ సంఘ్ కార్యాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ సహకర పరిధిలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీలను నడుపుతామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన మాట మేరకు సారంగాపూర్ చెక్కర కర్మాగారాని తెరిపించాలని, లేదంటే ప్రభుత్వం ముందుకు వచ్చి సహకార రంగంలో ఫ్యాక్టరీని నడపాలని కోరారు. అనంతరం ఫ్యాక్టరీని ప్రారంభించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు సేంద్రియ సాగుకు సంబంధించిన కేంద్రాన్ని కిసాన్ సంఘ్ కార్యవర్గ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

నిజామాబాద్ రూరల్: మండలంలోని మల్లారం శివారులోని నిర్మలాశ్రమంలో దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకుడు సాంబయ్య శాస్త్రి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మంగళవారం ఉదయం పూర్ణాహుతి, స్వామి వారికి అభిషేకం తదితర కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు.అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరవుతారని చెప్పారు. గజవాడ ఆగమయ్య గుప్తా, రామదత్త శర్మ, శ్రీకాంత శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన కార్యక్రమం

డిచ్‌పల్లి: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో మంగళవారం రైతులకు విత్తనాల ఎంపిక, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని ఏవో రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన వ్యవసాయశాస్త్రవేత్తలు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. అనంతరం శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి చర్చ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే ఈ అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	71,800	వెండి (కిలో)	90,500
22 క్యారెట్స్	66,230	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	35	50	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	60	90
జీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	30	50
బీర్నిసుకాయ	100	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	80
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	50	80	చామగడ్డ	50	80
కొత్తిమీర	80	120	గోరుచిక్కుడు	50	80
పుదీనా	80	100	చిక్కుడుకాయ	80	110
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.50, 01.45, 4.40,7.35,10.30
స్క్రీన్-2	రక్షణ(తెలుగు)-10.25 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)-1.30 7.30 - సత్యభామ(తెలుగు)-4.30 భజేవాయువేగం(తెలుగు)- 10.30
స్క్రీన్-3	లవ్‌మౌళి(తెలుగు)-10.40 బాడ్‌బాయ్స్(తెలుగు)-1.45,7.45 వెపన్(తెలుగు)-4.40 సత్యభామ(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	మనమే(తెలుగు)-10.20, 10.20 ముంజ్య(హిందీ)-1.35 గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి(తెలుగు) -4.20 సత్యభామ(తెలుగు)-7.25
స్క్రీన్-2	బాడ్ బాయ్స్(తెలుగు)-10.30,4.30 మనమే(తెలుగు)- 1.15,7.15 బాడ్ బాయ్స్(ఇంగ్లీష్)- 10.30
స్క్రీన్-3	సత్యభామ(తెలుగు)-11.25 , 10.40 భజే వాయువేగం (తెలుగు)-2.20 వెపన్(తెలుగు)- 5.15 ముంజ్య(హిందీ)- 7.55
స్క్రీన్ -4	గోల్డ్ నెం.1(తెలుగు)-10.30 లవ్‌మౌళి(తెలుగు)-1.20 గంగం గణేశా(తెలుగు)-4.25 రక్షణ(తెలుగు)-7.30 గ్యాంగ్ ఆఫ్ గోదావరి(తెలుగు)- 10.30
దేవి	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (తెలుగు)
నటరాజ్	రక్షణ(తెలుగు)-11.00 6.00 వెపన్(తెలుగు)-2.00 9.00
విజయ్	మనమే (తెలుగు)